

శాస్త్రవేత్తల సందర్శన
సింగపూర్, ఫిలిప్పీన్స్ శాస్త్రవేత్తల బృందం మంగళవారం రామకృష్ణాపురంలోని అమేయ కేవీకేను సందర్శించింది. - 8లో



నవోదయలో ప్రవేశాలు
చలకుర్తి నవోదయలో 9, 11 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శంకర్ తెలిపారు. - 8లో



వృద్ధుడికి 23 ఏళ్ల జైలుశిక్ష
బాలికపై లైంగిక దాడి చేసిన వృద్ధుడికి 23 ఏళ్లు జైలుశిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. - 8లో



మట్టిమనుషుల సాయుధపోరు

మహోజ్వల ఘట్టానికి 77 ఏళ్లు

దేశమంతటా 1947 ఆగస్టు 15న ప్రజలు స్వేచ్ఛావాయువులు పీలిస్తే హైదరాబాద్ రాష్ట్ర ప్రజలు బానిసత్వంలో మగ్గారు. నైజాం నవాబు హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనానికి నిరాకరించాడు. ఖాసీం రిజ్వీ సిద్ధం చేసిన రజాకార్లు, నిజాం సేనలు, దొరల గుండాలు దోపిడీలు, దౌర్జన్యాలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో అణిగిమణిగి ఉండే మట్టి మనుషులు ఏకమై గెరిల్లా పోరాటానికి తెరతీశారు. మహోజ్వలంగా సాగిన ఈ పోరాటంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అగ్రభాగాన నిలిచింది. వెట్టిచాకిరీలో మగ్గినవారు.. దొరా బాంచెన్ నీ కాల్మొక్తా అన్న మట్టిమనుషులు.. కారం, రోకలి, ఒడిశెల, బరిశె, బందూకు.. ఇలా అందిందల్లా చేతబట్టి పిడికిలి బిగించి బరిగీశారు. ఆపరేషన్ పోలో పేరుతో 1948 సెప్టెంబర్ 13న యూనియన్ సైన్యం కోదాడలో అడుగుపెట్టి అక్కడి నుంచి హైదరాబాద్‌కు జైత్రయాత్ర సాగించింది. ఈ క్రమంలో 17వ తేదీన నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభించింది.

ప్రత్యేక కథనాలు 8లో ▶



న్యూస్‌రీల్

క్షేత్రపాలకుడికి నాగవల్లి అర్చన

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న శ్రీఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయాల్లో సిందూరం పాటు పాలతో మన్యసూక్త పారాయణములతో అభిషేకం నిర్వహించారు. సింధూరంతో అలంకరించిన ఆంజనేయస్వామిని సుగంధద్రవ్యాలు, పూలతో అలంకరించి, నాగవల్లి దళార్చన చేపట్టారు. ఇక ప్రధానాలయంలో శ్రీస్వామి అమ్మవార్లకు విశేష పూజలను నిర్వహించారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీకి అధికారం ఇవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

సాక్షి, యాదాద్రి : రానున్న శాసన సభ ఎన్నికల్లో బీజేపీకి అధికారం ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య గౌడ్ ప్రజలను కోరారు. మంగళవారం భువనగిరిలోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించడం లేదన్నారు. తెలంగాణకు స్వాతంత్య్రం లభించిన సెప్టెంబర్ 17 ప్రజలకు అతిపెద్ద పండుగ రోజు అన్నారు. కేంద్రమే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో బుధవారం నిర్వహిస్తుందన్నారు. సెప్టెంబర్ 17న మోదీ జన్మదినం నుంచి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు బీజేపీ సేవాపక్షం నిర్వహిస్తుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్, నాయకులు పోతంశెట్టి రవీందర్, కర్నాటి ధనంజయ, పడమటి జగన్మోహన్ రెడ్డి, ఏలె చంద్రశేఖర్, గూడూరు నరోత్తంరెడ్డి, కొప్పుల యాదిరెడ్డి, చందా మహేందర్ గుప్తా, మేడి కోటేష్, తడిసిన మల్లారెడ్డి, మాయ దశరథ, విజయ భాస్కర్‌రెడ్డి, రత్నపురం బలరాం, ఆకుతోట రామకృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ ప్రారంభం



శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్

భువనగిరిటౌన్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేయిస్తున్న పోషణ్ బీ, పడాయి బీ కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు జిల్లాలోని నాలుగు ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం భువనగిరిలో శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. మయ్యాయి. ఈ నెల 19వ తేది వరకు కొనసాగనున్న ఈ శిక్షణ కార్యక్రమాన్ని భువనగిరి ప్రాజెక్టు పరిధిలో సీడీపీఓ శాగంటి శైలజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం టీచర్లకు పలు విషయాలపై మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

18న భువనగిరిలో 'జల్సా'



భువనగిరిలో జల్సా పోస్టర్ ఆవిష్కరిస్తున్న మజీద్ కమిటీ ప్రతినిధులు

భువనగిరిటౌన్ : మిలాద్ ఉన్ నబిని పురస్కరించుకుని ఈ నెల 18న భువనగిరి పట్టణంలోని ఏఆర్ గార్డెన్‌లో ముస్లిం మహిళల కోసం జల్సా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జలీల్‌పుర మజీద్ కమిటీ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం భువనగిరిలో మజీద్ కమిటీ ఆధ్వర్యంలో జల్సా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఖాజీమహల్లలో మధ్యాహ్నం 1 గంటకు నిర్వహించే జల్సా కార్యక్రమంలో మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర, ఆయన బోధించిన సూక్తులను మహిళలకు తెలియపర్చనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎండి వలీబాబా, ఎండి సుజావుద్దీన్, అబ్దుల్ మతిన్, ఉస్మాన్ చౌదరి, అబ్దుల్ గఫార్ చౌదరి, రహీమ్, ఫసి మౌలానా షోయిబ్ ఉర్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తిదే అగ్రస్థానం..



రామన్నపేట మండల కేంద్రం సమీపంలో ఏపుగా పెరిగిన పత్తిచేను

- అంచనాకు మించి సాగైన తెల్లబంగారం
- జిల్లాలో 1.13 లక్షల ఎకరాల్లో సాగు
- గతేడాదితో పోలిస్తే 4,337 ఎకరాలు అధికం
- స్వల్పంగా తగ్గిన వరిపంట

రామన్నపేట : ఈసారి వర్షాలు ఆలస్యంగా కురిసినా జిల్లాలో వానాకాలం పంటల సాగు విస్తీర్ణంపై పెద్దగా ప్రభావం చూపలేదు. గత ఏడాది వానాకాలం సీజన్‌తో పోలిస్తే వరిసాగు తగ్గగా, పత్తిసాగు పెరిగింది. ప్రధానంగా ఆగస్టులో కురిసిన వర్షాలు అన్నదాతకు అండగా నిలిచాయి. దీంతో జిల్లాలో వివిధ పంటల సాగు ముమ్మరంగా సాగింది. ఈ వానాకాలం సీజన్‌లో 1,10,000 ఎకరాల్లో పత్తిసాగు అవుతుందని అధికారులు అంచనా వేయగా 1,13,193 ఎకరాల్లో సాగైంది. గత యేడాదితో పోలిస్తే 4,337 ఎకరాల్లో అదనంగా పత్తి పంట సాగైంది. వ్యవసాయాధారిత జిల్లా అయిన యాదాద్రి భువనగిరిలో వరి, పత్తి ప్రధాన పంటలు. మూసీ ఆధారిత కాలువలు, గోదావరి జలాల రాకతో ఐదారేళ్లుగా వరిసాగు బాగా పెరిగింది. మెట్టపంటల విషయానికి వస్తే రైతులు పత్తిని అధికంగా సాగు చేస్తున్నారు. అయితే జిల్లాలో వరి తరువాత రైతులు పత్తిని అధికంగా సాగు చేస్తుంటారు. ప్రస్తుతం పత్తిచేలు పూతదశలో ఉన్నాయి. దసరా పండుగ తరువాత తొలి విడత పత్తి ఏరే పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.



పోచంపల్లి మండలం జూలూరులో సాగు చేసిన వరి పంట

ఈసారి.. తగ్గిన వరి

ప్రస్తుత వానాకాలంలో 2,95,000 ఎకరాల్లో వరిసాగు అవుతుందని అధికారులు అంచనా వేసినప్పటికీ 2,82,897 ఎకరాల్లోనే సాగైంది. గత వానాకాలం సీజన్‌తో పోలిస్తే 5,090 ఎకరాలు తక్కువగా సాగైంది. జూలై మూడవ వారం వరకు కేవలం 1,14,924 ఎకరాల్లో మాత్రమే రైతులు వరిసాగు చేశారు. ఆ తరువాత కురసిన వర్షాలకు భూగర్భజలాలు పెరగడం, గోదావరి జలాలు జిల్లాకు చేరడం, పిల్లాయిపల్లి వంటి మూసీ ఆధారిత కాలువలకు నీటిని విడుదల చేయడంతో రైతులు వరిసాగు చేశారు. జూన్, జూలైలో నాటువేసిన పొలాలు ప్రస్తుతం పొట్టదశకు వచ్చి గింజలు పాలు పోసుకుంటున్నాయి. మరో వారంలో పొలాలకు తడి తప్పనున్నారు.

వానాకాలం పంటలసాగు
వివరాలు (ఎకరాల్లో..)

పంట	సాగు విస్తీర్ణం
వరి	2,82,897
పత్తి	1,13,193
కంది	3764
పెసర	225
జొన్నలు	50
మొక్కజొన్న	32
పశుగ్రాసం	2700
ఇతరములు	321

దిగుబడి బాగా వస్తుందని ఆశిస్తున్నాం..



ఈ సారి వరి, పత్తిసాగు ఆలస్యమైంది. ఆగస్టులో కురిసిన వర్షాలతో పంటచేలు ఏపుగా పెరిగాయి. దిగుబడి మంచిగా వస్తుందని ఆశతో ఉన్నాం. సాగు ఖర్చులు పెరగడం ఆందోళన కలిగిస్తుంది. ఈ సారి ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి.

– పి.లింగయ్య రైతు

నేడు ప్రజాపాలన దినోత్సవం

- కలెక్టరేట్ ఆవరణలో ఉదయం 10గంటలకు కార్యక్రమం ప్రారంభం
- జాతీయ జెండా ఆవిష్కరించనున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

భువనగిరిటౌన్ : జిల్లా కలెక్టరేట్ సముదాయ ప్రాంగణంలో బుధవారం ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఉత్సవానికి తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేదర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఉదయం 10 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. 10.05 గంటలకు జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 10.10 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, అధికారులు, ప్రజలు రానున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు, అతిథులకు ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణ

ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్, జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల తోపాటు గ్రామాల్లోని గ్రామ పంచాయితీలు, ఇతర ప్రభుత్వ సంస్థల్లో జాతీయ జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



భువనగిరి కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ముస్తాబైన వేదిక

'స్వర్ణగిరి'లో సుదర్శన హవనం

భువనగిరి: పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సుదర్శన నరసింహ హవనం కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన సేవ, అనంతరం స్వామి వారికి నిత్య కల్యాణం, మధ్యాహ్నం సుమారు 3వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



సుదర్శన హవనం నిర్వహిస్తున్న అర్చకుడు

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



మోటకొండూర్ : క్రీడాకారులతో బీర్ల అయిలయ్య

మోటకొండూర్: విద్యార్థులు చదువులతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మోటకొండూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్–14, 17 జిల్లా స్థాయి ఖోఖో పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఎంతో చురుకుగా ఉండడమే కాకుండా క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలని, ఆటల్లో గొప్పగా రాణించి భవిష్యత్‌లో మంచి పేరును తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రఘురాంరెడ్డి, గడసంతల సీత, మధుసూదన్, నాతి మల్లేష్, కృష్ణమూర్తి, విశ్రాంత పీఈటీ పూల నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

'రీజినల్' అలైన్‌మెంట్ మార్చాలని రాస్తారోకో



చిమిర్యాలలో రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు నిర్వాసితులు

సంస్థాన్ నారాయణపురం : రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ భూ నిర్వాసితులు మంగళవారం సంస్థాన్ నారాయణపురం–చౌటుప్పల్ ప్రధాన రహదారిపై చిమిర్యాల గ్రామం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాసిత రైతులు మాట్లాడుతూ అలైన్‌మెంట్ మార్చే వరకు ఉద్యమిస్తామన్నారు. రాస్తారోకోతో రోడ్డు పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. నారాయణపురం ఎస్ఐ జగన్ జోక్యం చేసుకొని ట్రాఫిక్‌ను క్లియరు చేయించారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు, పల్లె పుష్పరెడ్డి, గుంటోజు శ్రీనివాసాచారి, తుమ్మల నర్సిరెడ్డి, దొంతగోని పెద్దులు, ఐతరాజు రాములు, గాజుల అంజయ్య, దోనూరి నర్సిరెడ్డి, బద్దం మల్లారెడ్డి, ఈదుల అనిల్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విస్తరణ దిశగా జగదేవ్‌పూర్ రోడ్డు

- ప్రమాదరహిత రోడ్డుగా మార్చేందుకు కార్యాచరణ సిద్ధం
- రెండు రోజులుగా వరుస సమీక్షలు
- పనులకు రూ.82 లక్షలు మంజూరు
- రేపటిలోగా ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు



భువనగిరిలోని జగదేవ్‌పూర్ చౌరస్తా

భువనగిరిటౌన్ : ప్రమాదాలకు నిలయంగా మారిన భువనగిరి–జగదేవ్‌పూర్ రోడ్డు విస్తరణకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నిశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో పలు నిర్ణయాలను తీసుకున్నారు. రోడ్డు మరమ్మతు పనులతో పాటు, ట్రాఫిక్ రూల్స్ తెలిపే బోర్డులు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు రూ.6 లక్షలు, రైల్వే బిడ్జి పూర్తి స్థాయిలో మరమ్మతులకు రూ.76 లక్షలు మంజూరు చేశారు. నెల రోజులలో రైల్వే బిడ్జి పనులు ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. కాగా ఈ నెల 18 నుంచి జగదేవ్‌పూర్ చౌరస్తా నుంచి ఇరువైపులా రోడ్డు ఆక్రమణలు తొలగించాలని మున్సిపల్, పోలీస్ శాఖలను ఆదేశించారు.

తీసుకోనున్న చర్యలు ఇవే..

ఇరుకుగా ఉన్న జగ్‌దేవ్‌పూర్ బస్టాప్ వద్ద ఆటో స్టాండ్‌ను, బస్ షెల్టర్‌ను ముందుకు జరపనున్నారు. కూలీల అడ్డాను దూరంగా మార్చనున్నారు. ఫ్రీ టర్నింగ్ కోసం డబ్బాలను తొలగిస్తారు. ముందుగా ఉన్న రేకుల షెడ్లను తొలగిస్తారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్ అద్దె మడిగెలు, బ్యాంకులు, రిలయన్స్ మాల్, రైతు బజార్, రాఘవేంద్ర హోటల్ వంటి పలు ప్రాంతాల్లో పార్కింగ్ సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభించనున్నారు. అద్దెలకు ఇచ్చిన సెల్లార్‌లను పార్కింగ్‌కు ఉపయోగించేలా ట్రాఫిక్ పోలీసులకు అప్పగించారు. భువనగిరిలో ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నారు.

రోడ్డు ఆక్రమణ ప్రదేశాల గుర్తింపు

హౌసింగ్ బోర్డు కాలనీ ఎదురుగా సితార వైన్స్ సమీపంలో, హైదరాబాద్ చౌరస్తా వద్ద, జగదేవ్‌పూర్ చౌరస్తా, జగదేవ్ రోడ్డు మార్గం, రైతు బజార్ ఎదుట ప్రిన్స్ కార్నర్ చౌరస్తా, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద, వినాయక (అంబేద్కర్) చౌరస్తా వద్ద, కొత్త బస్టాండు వద్ద వలిగొండ రోడ్డు మార్గంలో, గాంధీ పార్కు వద్ద, పాత బస్టాండ్‌లోని కూరగాయల విక్రయించే స్థావరాలు ఆక్రమణకు గురయ్యాయని అధికారులు గుర్తించారు.

స్వచ్ఛందంగా వెనకకు జరగాలి : అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి మున్సిపల్ పరిధిలోని జగ్‌దేవ్‌పూర్ వైపు రహదారిని ఆక్రమించుకున్న వారు ఈనెల 18లోపు స్వచ్ఛంద వెనకకు జరిగి అధికారులకు సహకరించాలని, లేని పక్షంలో 19న స్వయంగా అధికారులు వచ్చి తొలగిస్తారని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. మంగళవారం భువనగిరిలో స్థానిక వీధి వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ పరిధిలోని పలు రోడ్ల వెంబడి, ముఖ్య కూడళ్లలో అనధికారికంగా వీధి వ్యాపారాల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, రాచకొండ మున్సిపల్ కమిషనర్ జి.రామలింగం, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, ట్రాఫిక్ విభాగం, రాచకొండ, మున్సిపల్ అధికారులు, వీధి విక్రయదారున్నాయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, చిత్రంలో ఇతర అధికారులు

టీఎల్‌ఎం మేళాతో బోధన సులభం

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి : టీఎల్‌ఎం మేళాతో విద్యార్థులకు సులభతరంగా బోధన చేయడానికి అవకాశం ఉంటుందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం భువనగిరి పట్టణ శివారులోని ఏకే ప్యాలేస్‌లో జిల్లా స్థాయి టీఎల్‌ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. తరగతి గదిలో విద్యాబోధనకు టీఎల్‌ఎం అత్యంత అవసరమన్నారు. రెడీమేడ్‌గా కాకుండా ఉపాధ్యాయులు సొంతంగా తయారు చేసిన టీఎల్‌ఎంలను ఉపయోగిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన టీఎల్‌ఎలకు సృజనాత్మకత జోడించి ప్రదర్శించాలన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఎగ్జిబిట్స్‌ను రూపొందిన ఉపాధ్యాయులకు మెమొంటోలను అందజేశారు. అంతకుముందు అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, టీజీఓ రాష్ట్ర కోశాధికారి మందడి ఉపేందర్‌రెడ్డి మేళాను ప్రారంభించారు. జిల్లాలోని 17 మండలాల నుంచి మొత్తం జిల్లా స్థాయి టీఎల్‌ఎం మేళా 170 ప్రదర్శనలను ప్రదర్శించారు. నాలుగు విభాగాల నుంచి 8 ప్రదర్శనలు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కె.సత్యనారాయణ, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ జాన్ అఫ్గాన్, ఎంఈవో నాగవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టీఎల్‌ఎం మేళాలో ప్రదర్శనలు తిలకిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఎగ్జిబిట్‌లు

- ఇంగ్లిష్ విభాగంలో ఎస్ నాగమణి (ప్రాథమిక పాఠశాల పులిగిల్ల, వలిగొండ మండలం), ఎం మమత (ప్రాథమిక పాఠశాల, జనగాం, నారాయణపురం మండలం).
- తెలుగు విభాగంలో హరిత(ప్రాథమిక పాఠశాల, బీఎన్‌తిమ్మాపురం,భువనగిరి మండలం), ఎస్ రమాదేవి(ప్రాథమిక పాఠశాల ఆరెగూడెం, నారాయణపురం మండలం),
- గణితం విభాగంలో సీహెచ్ ఉదయ్‌కుమార్(ప్రాథమిక పాఠశాల, దూదివెంకటాపురం, రాజాపేట మండలం), వి శ్రీకాంత్(ప్రాథమిక పాఠశాల, మైలార్‌గడ్డ తండా, యాదగిరిగుట్ట మండలం),
- ఎన్విరాన్‌మెంట్ సైన్స్ విభాగంలో సీహెచ్ లక్ష్మీకుమారి(ప్రాథమిక పాఠశాల శారాజీపేట, ఆలేరు మండలం), డి.మంజుశ్రీ, (చౌటుప్పల్) ఎంపికయ్యాయి.



మేళాలో ప్రదర్శించిన ఎగ్జిబిట్‌లు

ఎదుళ్ల రిజర్వాయర్ వద్ద ఎఫ్‌ఎల్‌ఎస్ పెంచొద్దు

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


చౌటుప్పల్: శివన్నగూడెం ప్రాజెక్టుకు నీరందించే ఎదుళ్ల రిజర్వాయర్ వద్ద ఎఫ్‌ఎల్‌ఎస్(ఫుల్ లెవల్ సప్లయ్)ను పెంచకుండా చూడాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో నీటి పారుదల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎదుళ్ల రిజర్వాయర్ నుంచి శివన్నగూడెం ప్రాజెక్టుకు నీటిని తీసుకొచ్చేందుకు రూ.1,800 కోట్ల నిధులతో ప్రభుత్వం నుంచి పరిపాలనా అనుమతులు సాధించినట్టు గుర్తుచేశారు. ఎఫ్‌ఎల్‌ఎస్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ 440కి అంగీకరించొద్దన్నారు. అవసరమైతే ప్రభుత్వంతో తాను మాట్లాడుతానని పేర్కొన్నారు. శివన్నగూడెం రిజర్వాయర్ ద్వారా చౌటుప్పల్, నారాయణపురం మండలాలతోపాటు దండుమల్కాపురం గ్రామంలోని ఇండస్ట్రీయల్ పార్క్‌కు సైతం తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. శివన్నగూడెం రిజర్వాయర్ కింద డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ పనుల కోసం సర్వే నిర్వహించి డీపీఆర్ సిద్ధ చేయాలన్నారు. చౌటుప్పల్ మండలానికి మూసీ జలాలు అందించేందుకు గాను రంగారెడ్డి జిల్లా కొత్తగూడెం గ్రామం వద్ద చిన్న మూసీపై ప్రతిపాదించిన లిఫ్ట్ పథకంపై దృష్టిసారించాలని సూచించారు.

'బాలెంల' బలగంతో తిరుగుబాటు


బాలెంల గ్రామంలోని ప్రధాన సెంటర్

సూర్యాపేట అర్బన్: సాయుధ పోరాటంలో భాగంగా 1946 అక్టోబర్ 18న తెల్లవారుజామున నాలుగు గంటలకు పోలీసులు, రెవెన్యూ అధికారులు బాలెంల గ్రామాని చుట్టుముట్టారు. అప్పటికే గ్రామంలో ఉన్న నాయకులు పసిగట్టి తీవ్రంగా ప్రతిఘటించారు. తప్పని పరిస్థితుల్లో గ్రామ యువకులు గార్లపాటి అనంతరెడ్డి, పటేల్ మట్టారెడ్డి, సుంకు రంగయ్య, జమాల్ సాబ్, చాకలి భిక్షం, చాకలి చెన్నయ్య చేతికి అందిన గునపాలు, ముల్లు కర్రలు, రోకల్లలో పోలీసులతో గంటకు పైగా భీకర యుద్ధం చేశారు. పోలీసుల తుపాకులు లాక్కొని వారిని ఉరికించారు. దీంతో పోలీసులు పారిపోయారు. తిరిగి దొంగచాటుగా 25 మంది పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టి విక్షణారహితంగా ప్రజలపై కాల్పులు జరిపారు. ఆయుధాలు లేని యువకులు పోలీసు మూకలను ఎదుర్కోవడం సాధ్యం కాలేదు. పోలీసుల కాల్పుల్లో గార్లపాటి అనంతరెడ్డి, పటేల్ మట్టారెడ్డి అమరులయ్యారు.

నిజాం సైన్యంపై తిరగబడ్డ రావులపెంట


రావులపెంట బురుజు

మిర్యాలగూడ: తోపుచర్ల ఫిర్కాలోని రావులపెంట కేంద్రంగా సాయుధ పోరాటం సాగింది. వేములపల్లి మండలంలోని ఆమనగల్లు, పాములపాడు, రావులపెంటలో క్యాంపులు నిర్వహించి నిజాంకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమాలు చేశారు. రావులపెంటలోని భూస్వామ్య కుటుంబలో పుట్టిన చల్లా సీతారాంరెడ్డి నిజాంను ఎదిరించేందుకు క్యాంపులు నిర్వహించి వారి స్థావరాలపై దాడులు చేశారు. నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి, భీంరెడ్డి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆ క్యాంపుల్లో ఎంతో మంది తలదాచుకునేవారు. నిజాం పోలీసులు రావులపెంట, ఆగామోత్కూర్, తడకమళ్ల గ్రామాల్లో చొరబడి దాడులు చేసేవారు. చల్లా సీతారాంరెడ్డితో పాటు నారబోయిన నర్సయ్య, గట్టికొప్పుల రాంరెడ్డి కలిసి మొదటిసారిగా రావులపెంటలో సభ నిర్వహించారు. అనంతరం ధరణికోట సుబ్బయ్య, గుంటి వెంకటనర్సయ్య, అవిరెండ్ల ఎల్లయ్య, జిన్నె పెద్ద సత్తిరెడ్డి, చిన్న సత్తిరెడ్డి, రామనర్సయ్య, దొంతిరెడ్డి వెంకట్రాంరెడ్డి, దొంతిరెడ్డి చెన్నారెడ్డి, పాలగోని గోపయ్య, అవిరెండ్ల రామచంద్రయ్యలతో కలిసి ఉద్యమ రూపకల్పన చేశారు. చల్లా సీతారాంరెడ్డిని పట్టుకోవడానికి ఒకరోజు నిజాం సైన్యం మాటువేసింది. కానీ రావులపెంట గ్రామస్తులంతా కలిసి వారి స్థావరంపై దాడి చేయడంతో నిజాం పోలీసులు అక్కడి నుంచి పారిపోయారు.

బానిసత్వంపై ప్రజా పోరాటం

- నిజాంకు వ్యతిరేకంగా సామాన్య జనం తిరుగుబాటు
- రజాకార్ల కాల్పుల్లో నేలకొరిగిన ఎందరో వీరులు

రజాకార్లకు ఎదురొడ్డి నిలిచిన గుండ్రాంపల్లి

చిట్యాల: రజాకార్లకు ఎదురొడ్డి పోరాటం చేసిన గ్రామంగా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామం చరిత్రలో నిలిచిపోయింది. అప్పటి సూర్యాపేట తాలుకాలోని వర్ధమానుకోటకు చెందిన సయ్యద్ మక్బూల్ అనే వ్యక్తి తన అక్క నివాసముంటున్న గుండ్రాంపల్లి గ్రామానికి కుటుంబ సభ్యులతో కలిసి వలస వచ్చాడు. బతుకుదెరువు కోసం ఏపూరు గ్రామానికి చెందిన ఓ భూస్వామి వద్ద పనిలో చేరాడు. అనంతరం మక్బూల్ రజాకార్ల బృందంలో చేరి గుండ్రాంపల్లి కేంద్రంగా సాయుధ పోరాటంలో పాల్గొంటున్న వారిపై అరాచకాలకు పాల్పడటం మొదలుపెట్టాడు. మక్బూల్ అరాచకాలకు వ్యతిరేకంగా గుండ్రాంపల్లి కేంద్రంగా ఏపూరు, రెడ్డిబావి, సైదాబాద్, గుండ్లబావి, ఆరెగూడెం, పలివెల, వెలిమినేడు, పెద్దకాపర్తి, చిన్నకాపర్తి, ఎలికట్టె గ్రామాలకు చెందిన యువకులు దళాలుగా ఏర్పడ్డారు. వీరు రజాకార్లకు ఎదురొడ్డి దాడులు చేసేవారు. దీనిని సహించని మక్బూల్ తిరుగుబాటుదారులపై దాడులు చేశాడు. ఒకసారి అతడు 30మంది యువకులను బంధించి వారిని ఎడ్ల బండికి కట్టేసి గుండ్రాంపల్లి నడిబొడ్డున (నేడు ఏపూరు గ్రామానికి వెళ్లే దారిలోని కూడలి) బావిలో పడేసి సజీవ దహనం చేశాడు. ఈ ఘటనతో పలివెలకు చెందిన కొండవీటి గురున్నాథరెడ్డి నాయకత్వంలో మక్బూల్‌పై ఒకేసారి దళాలు దాడి చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. దీనిని గ్రహించి ఈ దాడి నుంచి మక్బూల్ తప్పించుకున్నాడు. మరోసారి వీరు జరిపిన దాడిలో మక్బూల్ చేయి విరగగా.. గుర్తుతెలియని ప్రదేశానికి వెళ్లిపోయాడు. కాని అతడి భార్య, కుమార్తె ప్రాణాలు కోల్పోయారు. అనంతరం మక్బూల్‌కు సహకరించిన వారి ఇళ్లపై దాడి చేసి వారిని చంపేశారు.

అమరవీరుల స్థూపం ఏర్పాటు..

నిజాం నవాబు భారత సైన్యానికి లొంగిపోయిన తర్వాత నాటి పోరాటంలో 30 మందిని బావిలో సజీవ దహనం చేసిన చోట 1992 జూన్ 4న సీపీఐ ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత కొన్నేళ్లకు విజయవాడ–హైదరాబాద్ హైవే విస్తరణలో భాగంగా ఈ స్థూపాన్ని తొలగించి ఏపూరుకు వెళ్లే దారిలో పునఃనిర్మించారు.



చిట్యాల: గుండ్రాంపల్లిలోని అమరవీరుల స్థూపం

ఒకేరోజు 17మంది సజీవ దహనం


కాసర్లపహాడ్ గ్రామ వ్యూ

అర్వపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. నిజాం నవాబు ఆకృత్యాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న 17మంది కాసర్లపహాడ్ గ్రామస్తులను ఒకేరోజు రజాకార్లు సజీవ దహనం చేశారు. ఈ ఘటన అప్పట్లో ఈ ప్రాంతంలో సంచలనం సృష్టించింది. రజాకార్లకు వ్యతిరేకంగా అప్పట్లో చిగుర్ల సోమయ్య, మాజీ సర్పంచ్ సిరికొండ నర్సయ్య దళ కమాండర్లుగా పోరాడారు. ఆ సమయంలో రజాకార్లు కాసర్లపహాడ్ గ్రామానికి వచ్చి బాకి ముత్తయ్య, వేముల దేవయ్య, వేముల అర్వపల్లి, వేముల నర్సయ్య, మచ్చ చినరామయ్య, మంచాల గోపయ్య, కాటిబోయిన నర్సయ్య, పిట్టల రామయ్య, వడ్డగాని నర్సయ్య, బరిశెట్టి పాపయ్య, నల్లు చంద్రారెడ్డి, బొరోజు లక్ష్మీనారాయణ, బొరోజు సత్తయ్య, దిర్శనపు రాజయ్య, చెరుకు ఈదయ్య, ముద్దెరబోయిన కొండయ్య, దిర్శనపు రంగయ్యను పట్టుకొని గ్రామ శివారులోని కొమ్మోనిబండపై పశువుల కొట్టంలో తాళ్లతో కట్టేసి వారిపై ఎండుగడ్డి వేసి సామూహికంగా సజీవ దహనం చేశారు. అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం ప్రాంతాలకు చెందిన అనిరెడ్డి రాంరెడ్డి, పగిడిమర్రి జాను, రింగు హనుమయ్య, జోగు వెంకులు, రింగు వీరమల్లు నిజాం పోలీసుల చేతిలో అమరులయ్యారు. అమరుల జ్ఞాపకార్థం కాసర్లపహడ్, అర్వపల్లిలో స్మారక స్థూపాలను నిర్మించారు.

ఉరి కంబానికి తలొగ్గని పోరు బిడ్డలు

మిర్యాలగూడ: సాయుధ పోరు సాగిస్తున్న సమయంలో ఉమ్మడి జిల్లాలోని అక్కినేపల్లి, షాబుల్లాపురం గ్రామాల్లో జరిగిన హత్య కేసులో జిల్లాకు చెందిన 12 మందికి ఉరి శిక్ష పడింది. అది 'తెలంగాణ 12'గా అంతర్జాతీయంగా సంచలనం రేపింది. హైదరాబాద్ గవర్నర్ ప్రత్యేక ట్రిబ్యూనల్ వీళ్ల కేసుపై విచారించింది. సైనిక గవర్నర్ ఆదేశాల మేరకు నల్లగొండలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ట్రిబ్యూనల్‌లో 1949 ఏప్రిల్ 7న నమోదైన క్రిమినల్ కేసుల్లో 1949 ఆగస్టు 13, 14న ఇచ్చిన తీర్పుతో 12 మందికి మరణశిక్ష విధించారు. ఇందులో నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి, దోమల జనార్దన్‌రెడ్డి, గార్లపాటి రఘుపతిరెడ్డి, దూదిపాల చినసత్తిరెడ్డి, మేరా హనుమంతు, మాగి వెంకులు, దాసరి నారాయణరెడ్డి, వడ్ల మల్లయ్య, ఎర్రబోతు రాంరెడ్డి, మిర్యాల లింగయ్య, కల్లూరి ఎల్లయ్య, గులాం దస్తగిరి ఉన్నారు. 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి రాకముందే ఉరిశిక్ష అమలు చేసేందుకు యత్నించారు. ఈ వార్త జాతీయ, అంతర్జాతీయంగా ప్రచారమైంది. లండన్ నుంచి ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ లాయర్స్ అధ్యక్షుడు డీఎన్. ప్రిట్, బొంబాయ్ నుంచి డేనియల్ లతీఫ్, గణేష్ షాన్‌బాగ్ వంటి న్యాయవాదులు హైదరాబాద్‌కు చేరుకుని అప్పటి స్థానిక న్యాయవాది మనోహర్‌లాల్ సక్సేనాతో కలిసి మరణశిక్ష ఆపే ప్రయత్నం మొదలుపెట్టారు. అంతర్జాతీయ సంస్థలు వారి మరణశిక్షలు రద్దు చేయాలని అప్పటి ప్రధాని నెహ్రూను విజ్ఞప్తి చేశాయి. హైదరాబాద్ స్టేట్ హైకోర్టు ఇచ్చిన ఈ మరణశిక్షల తీర్పును భారత సుప్రీంకోర్టులో సవాలు చేసినప్పటికీ అది వీగిపోయింది. అంతర్జాతీయ న్యాయవాది డీఎన్.ప్రిట్ స్వయంగా కేసు చేపట్టడం వల్ల విదేశీ విలేకరులు, రాయబారుల దృష్టిని ఆకర్షించింది. ఈ క్రమంలో రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ వారి మరణశిక్షలను యావజ్జీవ శిక్షలుగా మారుస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. ఒక్కొక్కరు 6 నుంచి 8 సంవత్సరాలు శిక్షలు అనుభవించి 1956లో కొందరు, 1958లో మరికొందరు విడుదల అయ్యారు. తెలంగాణ చరిత్రలో అతి ముఖ్యమైన ఈ ఉదంతానికి తగిన ప్రాముఖ్యత దక్కలేదు.


శిక్ష నుంచి విముక్తుడైన శ్రీనివాస్‌రెడ్డి

పెత్తందార్లకు ముచ్చెమటలు పట్టించా

- పేదలకు భూములు పంచాం
- సాయుధ పోరాట యోధురాలు రంగక్క


కొణిజేటి సత్యావతి (రంగక్క)

నేరేడుచర్ల: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తుపాకి పట్టి పెత్తందార్లను హడలెత్తించిన ధీరవనిత రంగక్క. ఆమె అసలు పేరు కొణిజేటి సత్యావతి అయినప్పటికి రంగక్కగానే పోరు భూమికి సుపరిచితం. 99 ఏళ్ల రంగక్క ఉద్యమ జీవితం గురించి ఆమె మాటల్లోనే..

సాయుధ పోరాటంలో నేను ఒక దళానికి కమాండర్‌ని. నల్లమల్ల అడవుల్లో నాలుగేళ్ల పాటు రహస్య జీవితం గడిపాను. అచ్చంపేట, అమ్రాబాద్ చుట్టుపక్కల ఊర్లను పెత్తందార్ల నుంచి విడిపించాం. పద్మానపల్లిలో పేదోళ్లు పండించిన ధాన్యమంతా భూస్వామి ఎరుకల నాగమ్మ ఇంట్లో పెట్టుకుందని తెలిసి ఆమెకు తుపాకీ చూపించి పేదలకు ధాన్యం పంచాం. పల్లెల్లో దొరలు, దేశ్‌ముఖ్‌ల భూములను పేదలకు పంచాం.

జైలులోనే పోరాటం

నన్ను మహబూబ్‌నగర్ జైలులో ఏడాదిన్నర పాటు నిర్బంధించారు. అక్కడ మరో 30 మంది ఆడవాళ్లు ఖైదీలుగా ఉండగా.. మా అందరికీ వారానికి ఒక్కటే సబ్బు ఇచ్చేవారు. దీంతో తోటి ఖైదీలను సమాయత్తం చేసి జైలులోనే ఉద్యమించాను. అప్పుడు జైలర్ దిగివచ్చి ఒక్కొక్కరికి నెలకు సరిపడా సబ్బులు, రోజుకు ఒక బకెట్ వేడి నీళ్లు ఇచ్చారు. ఆ తర్వాత చంచల్‌గూడ జైలుకు పంపించారు. అక్కడ ఆరు నెలలు శిక్ష అనుభవించా. అప్పుడు నా పెద్ద కుమారుడు జ్యోతిబాబుకు రెండేళ్లు. వాడు కూడా నాతో పాటే జైలులో ఉన్నాడు.

అడవిలోనే నా వివాహం..

ఆనాటి కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ నాయకుడు కొణిజేటి నారాయణ నాగర్‌కర్నూల్ ప్రాంతంలో మరో దళానికి కమాండర్. ఆయన సొంతూరు నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్నె. ఆయన కన్నా ముందే నేనే అడివిలోకి వచ్చినా అక్కడ ఒకరికి ఒకరం పరిచయమయ్యాం. మేమిద్దరం వివాహం చేసుకోవాలని పార్టీ పెద్దలందరూ ప్రతిపాదించారు. అమ్రాబాద్ అడవుల్లోనే కొండమీద వివాహం చేసుకున్నాం. మాది కులాంతర వివాహం. నా భర్త కొణిజేటి నారాయణ రెండు సార్లు సర్పంచ్‌గా గెలిచారు. ఒకసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ఆయన ఐదారేళ్ల క్రితం మరణించారు.

ఆంధ్రాలో పురుడు పోసుకున్నా..

నేను గర్భవతిగా ఉన్నప్పుడు గుంటూరులోని పార్టీ నాయకుడి బంధువుల ఇంట్లో ఉంచారు. కొంతకాలం నర్సరావుపేటలో ఉండి, నెలలు నిండే సమయానికి ఒంగోలుకు మకాం మార్చాం. అక్కడే ఓ ఆస్పత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చాను. బాబుకు మూడు నెలలు వచ్చే వరకు ఒంగోలునే ఉన్నా. తర్వాత పిల్లాడిని భుజాన వేసుకుని తిరిగి నల్లమల్లకు చేరుకున్నాను. సాయుధ పోరాటం విరామం తర్వాత ఒకరోజు ఆత్మకూరులో రైతు సభకు వెళ్లిన నన్ను పోలీసులు అరెస్ట్ చేశారు. తమ పార్టీ నాయకుల ఆచూకీ చెప్పాలని పోలీసులు హింసించారు. నాపై 9 కేసులు బనాయించారు. ఏడాదిన్నర పాటు జైలు జీవితం గడిపాను.

నేను చచ్చిపోయా అనుకున్నారు..

ఒక రోజు నల్లమల్లలో పోలీసులు నన్ను చుట్టుముట్టారు. ఆ సమయంలో దళం సభ్యులమంతా చెల్లాచెదురయ్యాం. ఆ రోజంతా అడవిలోనే ఒంటరిగా తలదాచుకొని తెల్లవారాక ఓ చెంచుగూడేనికి చేరుకున్నా. నా కాళ్లకు గాయాలయ్యాయి. వారందరు తిరిగి నన్ను మంచిగా చేశారు. నా జాడ తెలియక నేను చనిపోయాననుకున్నారు. ఆ తర్వాత గూడెం వాళ్ల ద్వారా నేను బతికాను అని లోకానికి తెలిసింది. నాకు ఆరుగురు కుమారులు సంతానం. ప్రస్తుతం హైదరాబాద్‌లోనే కుమారుల వద్ద ఉంటున్నా.

ఎర్రపహాడ్ గడీపై దాడి

నూతనకల్: తెలంగాణ సాయుధ పోరాటం సమయంలో నూతనకల్ మండలం ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన జెన్నారెడ్డి ప్రతాప్‌రెడ్డి దేశ్‌ముఖ్ ఆధీనంలో లక్షా 50వేల ఎకరాల భూమి ఉంది. ఎర్రపహాడ్‌లోని సువిశాలమైన గడీలో రజాకార్లు ఉండటాన్ని పసిగట్టిన గాయం రాజిరెడ్డి, భీంరెడ్డి కొండల్‌రెడ్డి దళాల నాయకత్వంలో ప్రజలను పోగు చేసి గడీపై దాడికి ప్రయత్నించారు. గడీపై బాంబులతో దాడి చేయగా.. కోట బురుజుకు బాంబు తగిలి జనంలో పడటంతో చిల్పకుంట్లకు చెందిన బత్తుల వెంకన్న మృతిచెందాడు.


ఎర్రపహాడ్‌లోని గడీ

ఊదరబాంబుల మోతతో రజాకార్ సైన్యం పరార్

ఆత్మకూర్ (ఎస్): రజాకార్ల సైన్యం రావిపహాడ్ నుంచి ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని కోటపహాడ్ గ్రామానికి వస్తున్నట్లు సమాచారం అందుకున్న భీంరెడ్డి నర్సింహారెడ్డి దళం వారిని వెంబడించింది. ఈ సమయంలో ఓ ఇంట్లోకి చొరబడిన నిజాం సైన్యం కాల్పులు జరుపుతోంది. దీంతో భీంరెడ్డి దళం చుట్టూ పక్కల ఉన్న గడ్డిమోపులను తీసుకొచ్చి అందులో మిరపకాయలను వేసి మంట పెట్టింది. ఈ మంటలతో ఇంట్లో ఉన్న నిజాం సైన్యం ఇబ్బంది పడి అక్కడి నుంచి పరారయ్యారు.

బాల సంఘంలో చేరి వడిసెలు పట్టాం



రామన్నపేట: రజకార్లతో పోరాటం సమయంలో నా వయస్సు 14 సంవత్సరాలు. కమ్యూనిస్టు నాయకులు ఆరుట్ల రామచంద్రారెడ్డి, కాచం కృష్ణమూర్తి పిలుపు మేరకు నాతో పాటు పలువురు కలిసి బాల సంఘంలో చేరాం. ఉద్యమాన్ని అణచివేసేందుకు మా గ్రామంలో డాగ్ బంగ్లాను నిర్మించారు. అందులో మిలిటరీ క్యాంపు ఉండేది. ఒకసారి మిలిటరీ తుపాకీ మాయమైంది. దీంతో అనుమానం వచ్చిన ప్రతిఒక్కరిని క్రూరంగా హింసించారు. వడిసెలు, కారంపొడి పట్టుకొని సాయుధ పోరాటంలో పాల్గొన్నాం. మా కంటే ముందు గ్రామానికి చెందిన చాలా మంది యువకులు సంఘంలో పనిచేశారు.

– ఉయ్యాల లక్ష్మీనర్సు, సాయుధ పోరాట యోధుడు, మునిపంపుల

కొరియర్‌గా పనిచేశా



ఆత్మకూరు(ఎం): సాయిధ పోరాటంలో రావి నారాయణరెడ్డికి కొరియర్‌గా పనిచేశాను. అప్పుడు నా వయస్సు 18 సంవత్సరాలు. పెత్తందార్ల ఆగడాలు నశించాలంటూ రాత్రి పూట గ్రామాల్లో గోడల మీద రాతలు రాసేవాడిని. మోత్కూరు ఠాణా మీద సాయుధ పోరాట దళాలు చేసిన దాడిలో రావి నారాయణరెడ్డితో కలిసి పాల్గొన్నా. రావి నారాయణరెడ్డి ఎక్కడకు పోతే అక్కడికి వెళ్లేవాడిని. రాచకొండ, చల్లూరు, గుడిమల్కాపురం గుట్టల్లో రహస్యంగా వారితో పాటు ఉండేవాడిని. కొరియర్‌గా పనిచేస్తున్నావంటూ పంజాబ్ నుంచి వచ్చిన మిలిటరీ పోలీసులు కొట్టిన దెబ్బలు ఇప్పటికీ నా ఎడమ కాలుకు ఉన్నాయి. ఇప్పుడు నా వయస్సు 92 సంవత్సరాలు.

– బత్తిని యాదగిరి, సాయుధ పోరాట యోధుడు, పుల్లాయిగూడెం

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం


విజయ (ఫైల్)

కొండమల్లేపల్లి: టీవీఎస్ ఎక్సెల్‌ను కారు ఢీకొన్న ఘటనలో మహిళ మృతిచెందింది. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. పెద్దఅడిశర్లపల్లి మండలానికి చెందిన సంకు లింగారెడ్డి తన అక్క పాశం విజయ(48)ను కొండమల్లేపల్లిలో హైదరాబాద్ బస్సు ఎక్కించడానికి టీవీఎస్ ఎక్సెల్‌పై వస్తుండగా.. కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి సమీపంలో చేరుకోగానే వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పాశం విజయను 108 వాహనంలో దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. లింగారెడ్డికి గాయాలు కాగా దేవరకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతురాలి భర్త జైపాల్‌రెడ్డి హైదరాబాద్‌లో పెయింటింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

రాజాపేట: ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రాజాపేట మండలం బొందుగుల గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొందుగుల గ్రామానికి చెందిన గీత కార్మికుడు నర్మెట్ట శివ రోజుమాదిరిగా మంగళవారం సాయత్రం గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా.. మోకు జారి చెట్టుపై నుంచి కిందపడ్డాడు. దీంతో శివకు తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు అతడిని చికిత్స నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- 9వ, 11వ తరగతిలో చేరేందుకు అవకాశం



చలకుర్తిలోని జవహర్ నవోదయ విద్యాలయం

పెద్దవూర: పెద్దవూర మండలం చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యాసంవత్సరానికి గాను 9వ, 11వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 9వ తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ ఉండాలని, 01–05–2011 నుంచి 31–07–2013 మధ్య జన్మించి ఉన్న వారు అర్హులని తెలిపారు. అదేవిధంగా 11వ తరగతిలో ప్రవేశానికి గాను ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతి చదువుతూ ఉండాలని, 01–06–2009 నుంచి 31–07–2011 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. పదవ తరగతి చదువుతున్న, నివాసం ఉంటున్న జిల్లా ఒకటే అయినప్పుడు మాత్రమే విద్యార్థి జిల్లాస్థాయి మెరిట్ కోసం పరిగణింపబడతారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న అభ్యర్థి అభ్యర్థిత్వం ఓపెన్, గ్రామీణ కోటా కింద పరిగణించబడుతుందని, పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థి అభ్యర్థిత్వం అర్బన్ కోటా కింద పరిగణించబడుతుందని పేర్కొన్నారు.

- దరఖాస్తులు జాగ్రత్తగా నింపాలని, తప్పుగా నింపితే ప్రవేశ పరీక్షలో ఎంపికైనప్పటికీ అడ్మిషన్ కాన్సిల్ అవుతుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేయటానికి ఈ నెల 23 చివరి తేదీ అని, ప్రవేశ పరీక్ష 2026 ఫిబ్రవరి 7న నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ ఫారంను నింపి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

బాలికపై అత్యాచారం చేసిన వృద్ధుడికి 23 ఏళ్ల జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ): పదేళ్ల బాలికను అత్యాచారం చేసిన 60 ఏళ్ల వృద్ధుడికి 23 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి ఎన్.రోజారమణి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... నల్లగొండ మండలంలోని అన్నెపర్తి గ్రామంలో బాధిత కుటుంబం అద్దె ఇంట్లో ఉంటుంది. 2023 సంవత్సరం మార్చి 28న బాలిక స్కూల్‌కి వెళ్లి ఇంటికి వచ్చింది. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లగా బాలిక ఒంటరిగా ఉంది. అదే గ్రామానికి చెందిన మర్రి ఊషయ్య బాలికకు తినుబండారాలు ఇచ్చి అత్యాచారానికి పాల్పడ్డాడు. సాయంత్రం కూలీ పనులు ముగించుకుని తల్లితండ్రులు ఇంటికి వచ్చే సమయానికి కూతురు ఏడుస్తూ ఉండడాన్ని గమనించారు. ఏం జరిగిందని అడగగా బాలిక జరిగిన విషయాన్ని తల్లితండ్రులకు చెప్పింది. నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ సరైన ఆధారాలు కోర్టుకు సమర్పించగా ఆయన వాదనలతో ఏకీభవించిన జడ్జీ ఎన్.రోజారమణి నిందితుడికి 23ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.40 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు. అదే విధంగా బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

మరో ఘటనలో 20 ఏళ్లు

చివ్వెంల(సూర్యాపేట): చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 సంవత్సరాల జైలుశిక్ష, రూ.25 వేల జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీ శారద మంగళవారం తీర్పు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల రామాపురం గ్రామానికి చెందిన ఏడేళ్ల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన వరుసకు మేనమామ అయిన పెరిక నవీన్ బాలికకు ఫోన్‌లో గేమ్స్ పెట్టిస్తానని చెప్పి ఇంట్లోకి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక అస్వస్థతకు గురికాగా తల్లి ఆస్పత్రికి తీసుకువెళ్లింది. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్.. చిన్నారి అత్యాచారానికి గురైందని తెలిపింది. తల్లి ఏంజరిగిందని చిన్నారిని అడుగగా జరిగిన విషయం చెప్పింది. నిందితుడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు అతడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపల్లి లింగయ్య వాదనలతో న్యాయమూర్తి ఏకీభవిస్తూ నిందితునికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధించారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

మిర్యాలగూడ టౌన్: రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మిర్యాలగూడ మండలం కిష్టాపురం వద్ద సోమవారం రాత్రి జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టాపురం గ్రామానికి చెందిన ఎస్. సత్యనారాయణరెడ్డి(72) సోమవారం రాత్రి ఇంటి నుంచి కిరాణా దుకాణానికి వెళ్తూ అద్దంకి–నార్కట్‌పల్లి రహదారి దాటుతుండగా.. మిర్యాలగూడ నుంచి దామరచర్ల వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. సత్యనారాయణరెడ్డి తలకు తీవ్ర గాయమైంది. అతడిని మొదట మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి.. అక్కడి నుంచి నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి మనుమరాలు హరిత ఫిర్యాదు మేరకు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సింగపూర్, ఫిలిప్పీన్స్ శాస్త్రవేత్తల సందర్శన


అమేయ కృషి వికాస కేంద్రంలో కొబ్బరి చెట్టును పరిశీలిస్తున్న విదేశీ వ్యవసాయ శాస్త్రవేత్తలు

సాక్షి, యాదాద్రి : సింగపూర్, ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం రామకృష్ణాపురంలోని అమేయ కృషి వికాస కేంద్రాన్ని సందర్శించారు. మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న క్యాన్సర్ నివారణకు ఫిలిప్పీన్స్‌లో ఉపయోగిస్తున్న 3సి క్యారెట్ కుకుంబర్ సెలరీ ద్రావణం ద్వారా తాము సాధించిన ఫలితాలను వివరించి 3సీ ద్రావణం తయారు చేసుకునే విధానాన్ని వివరించారు. అమేయ కృషి వికాస కేంద్రం రూపొందించిన ఆగ్రో హోమియోపతిని గురించి 'అమేయ' నిర్వాహకుడు జిట్టా బాల్‌రెడ్డి వివరించారు. తాము రూపొందించిన పోషక ఎరువుల, పేడ ద్రావణం వినియోగంలో వస్తున్న ఫలితాలను వివరించారు. జాడంతో పాటుగా ఆగ్రో హోమియోపతి మరింత అందుబాటులోకి తెచ్చి కృషి సమష్టిగా కొనసాగిద్దామని విదేశీ శాస్త్రవేత్తల బృందం, అమేయ కృషి వికాస కేంద్రం ప్రతినిధులు బాల్‌రెడ్డి, జ్యోతిరెడ్డి పరస్పర అంగీకారానికి వచ్చారు.

ఎండు ఆకు తెగులు.. నివారణ చర్యలు

పాడిపంట


వరి పంటకు సోకిన ఎండు ఆకు తెగులు

త్రిపురారం: ఉమ్మడి జిల్లాలో రైతులు సాగు చేసిన వరి పంటలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా బ్యాక్టీరియా సోకడం వల్ల ఎండు ఆకు తెగులు ఉధృతిని అధికంగా ఉంది. దీంతో రైతులు సకాలంలో యాజమాన్య చర్యలు చేపట్టాలని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగాం కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ సూచిస్తున్నారు. ఎండాకు తెగులు గుర్తించే పద్ధతులు, నివారణ చర్యలు ఆయన మాటల్లో...

తెగులు సోకడానికి కారణాలు

ఆగస్టు–సెప్టెంబర్ మధ్యలో ఉండే వాతావరణ పరిస్థితులు, మబ్బులతో కూడిన వాతావరణం రెండు నుంచి మూడు రోజులు ఎడతెరిపి లేకుండా కురిసే వర్షాలు, తక్కువ ఉష్ణోగ్రతల కారణంగా వరిలో ఎండాకు తెగులు ఆశించడానికి దోహదం చేస్తాయి. నారు మడి దశ నుంచి గింజ పాలు పోసుకునే వరకు ఈ తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. చెట్టు నీడ పడే ప్రదేశంలో ఎక్కువగా ఎండాకు తెగులు ఆశించి మిగిలిన పంటకు వేగంగా వ్యాప్తిస్తుంది.

గుర్తించే విధానం

వరి పంటలో ఎండాకు తెగులు సోకిన ప్రదేశంలో ముందుగా ముదురు ఆకులకు పసుపు రంగు మచ్చలు ఏర్పడి పైనుంచి కింది అంచుల వెంబడి వ్యాప్తించి ఎండుతూ వస్తాయి. ఉదయం సమయంలో గమనించినట్లయితే ఆకుల మీద పసుపు రంగు జిగురు ముద్దలు కనబడతాయి. ఎండ వేడిమికి గట్టిపడి రాలిపోతాయి. ఈ ఎండిన బ్యాక్టీరియా ముద్దలు నీటి ద్వారా వెళ్లి మిగిలిన పంటకు వ్యాప్తిస్తుంది.

నివారణ చర్యలు

బ్యాక్టీరియా వ్యాప్తి నివారణకు తెగులు సోకిన మొక్కల నుంచి ఆరోగ్యకరమైన పంటకు నీరు పారకుండా చూసుకోవాలి. తెగులు ఆశించిన పొలంలో నత్రజని వేయకూడదు. కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు మరియు ప్లాంటోమైసిన్ 4 గ్రాములు (లేదా) పోషామైసిన్ (లేదా) స్ట్రెప్టోసైక్లిన్ 4 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపి 2 నుంచి 3 సార్లు వారం వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి.